తేదీ 14.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు

# అంతరాత్మ ననుసరించండి

పరమ పావనమైన భారతావనియందు
        సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతము లన్నిటియందు వన్నె గాంచినయట్టి
        ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
        మాతృభావము కన్న మాన్యమెద్ది?
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
        మన దేశ నీతిని మంట గలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె
ఔర! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఱుగ లేదొ
అట్టులైనారు మన భారతీయులు నేడు.

**ప్రేమస్వరూపులారా!**

భారతదేశము మహా భాగ్యవంతమైన దేశము. ఇది మహాపుణ్యభూమి, త్యాగభూమి, కర్మభూమి. ఇట్టి భారతదేశ ఔన్నత్యమును ఈనాడు మన భారతీయులే గుర్తించుకోవటం లేదు. “ఏనుగెట్టుల తన బల మెఱుగలేదొ అట్టులైనారు మన భారతీయులు నేడు.” ఏనుగు తోకతో కొడితే మనిషి తొమ్మిదడుగుల దూరంలో పోయి పడతాడు. అంతటి శక్తి కలిగిన ఏనుగును మావటి అంకుశముతో లొంగదీసుకోగల్గుతున్నాడు. తన బలమేమిటో తనకు తెలియకపోవడంచేత ఏనుగు మావటి చెప్పినట్లు వింటుంది. అదేవిధముగా, భారతీయులు

srisathyasaivachanamrutam

కేవలం దేహమును ఆధారం చేసుకొని, ఉపాధిపై ఆధారపడి తమ శక్తిని తాము తెలుసుకోలేకపోతున్నారు.

**దేహము పాంచభౌతికముదేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

ఇట్టి సత్యాన్ని గుర్తించాలి. ఈ దేహములో ఉండినటువంటి శక్తి మరి దేనియందుకూడను లేదు. అవాఙ్మానస గోచరుడైన దైవాన్నికూడను కట్టివేయగల మహాసత్యశక్తి ఈ దేహమునందు ఉన్నది. ఇది 'సత్యస్య సత్యం'. ఈ సత్యశక్తిని ఎవ్వరుకూడను పట్టలేరు. సత్యమును ఎవ్వరూ కాంచలేరు. దీనిని అనుభవించ వలసినదేగాని, వర్ణించుటకు వీలుకాదు. సత్యమే దైవస్వరూపము. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య**

ఈ జగత్తులో ఎందుచూసినా సత్యమే సాక్షాత్కరిస్తున్నది. మిథ్య అనేది లేనే లేదు. కాని, మానవుడు అసత్యమైన దేహప్రవృత్తిని మాత్రమే గుర్తించుకొని, దీనినే సత్యముగా భావిస్తున్నాడు. మొట్టమొదట సత్యాన్ని గుర్తించాలి. సత్యాన్ని ప్రార్థించాలి. సత్యాన్ని నిలబెట్టుకోవాలి. 'సత్యాన్నాస్తి పరో ధర్మః'. సత్యమే లేకుండిన ధర్మమే లేదు. సత్యమనే పునాదిపైననే ధర్మమనే భవనము నిలిచియున్నది.

**నీవు మానవుడవు కాదు, మాధవుడవే!**

మానవుడు తన ఇంద్రియముల నరికట్టుకొనలేక, దేహసంబంధమైన భ్రాంతులను వదలిపెట్టలేక నిత్యసత్యమైన ఆత్మతత్త్వమును మరచిపోతున్నాడు. అది ఎటువంటిది? 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం.'

sri sathyasaivacharamrutam

మీయందే ఉన్న అట్టి సత్యమును విస్మరించి, అనిత్యము, అశాశ్వతము, అసత్యమైనటువంటి కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, మానసిక తత్త్వములను అనుసరిస్తున్నారు. మనస్సు ఎటువంటిదో మీకు తెలుసునా? అది ఎక్కడికి పడితే అక్కడికి ఇష్టమొచ్చినట్లు పరుగెత్తుతూ ఉంటుంది; సుగంధముతో కూడిన పుష్పములపైనా వ్రాలుతుంది; దుర్గంధముతో కూడిన పెంటకుప్పపైన కూడా పోయి వ్రాలుతుంది. ఈరీతిగా మంచి, చెడు రెండింటిపైన వ్రాలే మనసును నీవు ఎట్లా నమ్మగలవు! పిచ్చికోతివంటి మనస్సును, నీటిబుడగవంటి దేహమును నమ్ముకొని మనం బ్రతుకుతున్నాము. ఏనాడు నీవు దేహభ్రాంతిని వదలి, ఆత్మతత్త్వమునే చింతిస్తావో, ఆనాడు నీవు మానవుడవు కాదు, మాధవుడవే! మాధవుడవే నీవైయుండి 'నేను మానవుడ'నని భ్రమిస్తున్నావు. ఈ జగత్తు నిమిత్తమై నీవు మానవరూపాన్ని ధరించావు. ఈ రూపము కేవలం ఒక వేషము. ఈ ప్రపంచంలో ఉన్నంతవరకు ఈ వేషము ధరిస్తావు. జగత్తనే స్టేజి వెనుకకు పోతూనే ఈ డ్రస్సును వదలిపెడతావు. ఈ డ్రస్సును బట్టి నీవు నాటక మాడుతున్నావు. నీ నిజమైన స్వరూపాన్ని నీవు గుర్తించాలి.

**అంతర్దృష్టితో విచారణ చేస్తే సత్యము గోచరిస్తుంది**

మానవత్వము పవిత్రమైనది, దివ్యమైనది. ఇట్టి మానవత్వాన్ని మట్టి కలుపుతున్నాడు, మానవుడు. దీనిని సార్థకం గావించుకోవాలి. నీవు నేర్చిన విద్యలు, నీ శక్తిసామర్థ్యములు ఇవన్నీ క్షణభంగురాలు. నిత్య సత్యమైనటువంటి ఆత్మతత్త్వాన్ని గుర్తించడానికి నీవు ప్రయత్నించాలి. నీవు దేహము కాదు. 'మీరెవరండీ?' అని ఎవరైనా నిన్ను ప్రశ్నిస్తే, 'నేను ఫలానివాడిని' అని చెబుతావు. నీ దేహమును, నీ వృత్తిని, నీ వంశమును, నీవు నివసించే ప్రాంతమును పురస్కరించుకొని నిన్ను నీవు పరిచయం చేసుకుంటావు. 'రామదాసు ఎవరు?' అని అడిగితే 'నేను' అంటావు. కాని, 'రామదాసు' అనేది కేవలం నీ దేహమునకు నీ తల్లిదండ్రులు పెట్టిన పేరేకాని, నీ అసలైన పేరు కాదు. 'నేను' అన్నదే నీ అసలైన పేరు. అదే నిత్యసత్యమైనది.

'రామదాసు' అంటే దశరథుని కుమారుడైన శ్రీరామునికి దాసుడు. దశరథుడంటే ఎవరు? అయోధ్యను పరిపాలించిన దశరథుడు కాదు. యోధులు సహితం చొరడానికి

sri sathyasai vahamrutam

వీలుకాని ప్రదేశమే అయోధ్య. దశేంద్రియములతో కూడిన దేహమే దశరథుడు. అతనికి ముగ్గురు భార్యలు - కౌసల్య, సుమిత్ర, కైకేయి. వీరు ముగ్గురూ సత్త్వరజస్తమో గుణములకు ప్రతీకలు. సాత్త్విక గుణమే కౌసల్య, రజో గుణమే కైక, తమోగుణమే సుమిత్ర. ఈవిధంగా అంతర్దృష్టితో విచారణ చేసి మొట్టమొదట మనలో నున్న సత్యాన్ని గుర్తించాలి. నాటి మహనీయులు ఇట్టి సత్యాన్ని గుర్తించి వర్తించారు. మన ప్రాచీనులు ఈనాటి మానవులవలె మూర్ఖంగా ప్రవర్తించేవారు కాదు. వారు సత్యాన్ని గుర్తించి, సత్యాన్ని బోధించి, సత్యముతోనే జీవించారు. సహనమే భారతీయుల సహజ లక్షణం. సహనము లేనివాడు మానవుడే కాదు.

**పర స్త్రీని కన్నెత్తి చూడటం మహాపాపం**

'మాతృదేవో భవ, పితృదేవో భవ'. భారతీయ సంస్కృతిలో తల్లికే ప్రథమ స్థానము అందించబడింది. కనుకనే, రామునికి సుప్రభాతము చెప్పే సమయంలో మొట్టమొదట 'కౌసల్యా సుప్రజా రామా...' అంటారు. మానవునికి తల్లియే ప్రథమ దైవం. కాని, ఈనాడు తల్లిని ఎంతమంది గౌరవిస్తున్నారు! రాముడు విశ్వామిత్రుని యాగసంరక్షణార్థం వెళ్ళే సమయంలో తల్లి పాదాలకు నమస్కరించగా ఆమె, 'నాయనా! అలనాడు ప్రహ్లాదుని పాలించిన పరమ పురుషుడు, ధ్రువ కుమారుని సాకిన వైకుంఠవాసి, ఆ అమర వంద్యుడు, ఆర్తజనులను పాలించు ఆ అనాథనాథుడు నీకు విజయము చేకూర్చు గాక', అని ఆశీర్వదించి పంపింది. ఆ తల్లి ఆశీర్వాద బలముచేతనే రాముడు రాక్షసులను సంహరించి యాగసంరక్షణ గావించాడు. అంతేకాదు, జనకుని సభలో శివధనుర్భంగము గావించి పోటీలో ఉత్తీర్ణుడయ్యాడు. కర్మయోగి, మహాజ్ఞాని అయిన జనకుడు సీతను తీసుకువచ్చి, "నాయనా! నీకంటే మించినవారు లేరు. ఇదిగో, నా కుమార్తెను నీకిచ్చి వివాహం చేయాలనుకుంటున్నాను", అన్నాడు. కాని, రాముడు తన తల్లిదండ్రుల అనుమతి లేకుండా వివాహానికి అంగీకరించ నన్నాడు. ఈనాటి యువకులు తమకు వివాహం నిశ్చయమైతే, ఓహో... గొప్పగా పత్రికలు ముద్రించి అందరికీ పంచుతారు. కాని, రాముడు అలా చేయలేదు. 'మేము నలుగురం ఒకే సమయంలో పుట్టాము. కాబట్టి, ఉపనయనము గాని, వివాహముగాని ఏది జరిగినా మా నలుగురికీ ఒకే సమయంలో జరగాలి' అని భావించాడు.

sri sathyasaivechanamrutam

ఈనాటి పిల్లలు 'ఎంగేజిమెంట్' అయిన తక్షణమే ఇద్దరూ కలసి సినిమాలకు వెళతారు. ఇది మంచి పద్ధతి కాదు. వివాహం జరిగేంతవరకు సీత బయటికే రాలేదు; రాములు ఆమెను చూడలేదు. తల్లిదండ్రులు వచ్చిన తరువాత, విశ్వామిత్రుడు చెప్పిన తరువాతనే రాముడు వివాహానికి ఒప్పుకున్నాడు. అయితే, వివాహమయ్యేంత వరకు తాను సీతను చూడలేదు. ఎందుకంటే వివాహం కానంతవరకు ఆమె పరస్త్రీయే! పరస్త్రీని కన్నెత్తి చూడటం మహాపాపం.

చూశారా! ఆనాటివారి హృదయాలు ఎంత పవిత్రమైనవి! ఎంత నిత్యసత్యమైనవి! త్రేతాయుగ, ద్వాపర యుగాలలో ప్రజలు సత్శీలమునకు ఎంతో ప్రాధాన్యత నిచ్చినారు. అందుచేతనే, ఆ యుగాలకు అంత గొప్ప పేరు వచ్చింది. రామునివలె మీరుకూడా ప్రతి విషయంలోనూ పెద్దల ఆజ్ఞను పాటించాలి. పెద్దలను పూజించాలి, గౌరవించాలి. పెద్దల మాటలను అశ్రద్ధ చేయక ప్రేమతో పాటించినప్పుడే మీరు జీవితంలో శాంతిని అనుభవించగలరు.

రామాయణంలో చిత్రవిచిత్రమైన సంఘటనలు అనేకం జరుగుతూవచ్చాయి. దశరథుడు కైకకు ఇచ్చిన మాట ప్రకారం రాముడు పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం చేయవలసివచ్చింది. గొప్ప రాణి అయినటువంటి కైక తన సర్వెంటు మాటలకు లొంగిపోయి రాముణ్ణి అరణ్యానికి పంపింది. మనము విలువ ఇవ్వవలసింది యజమాని మాటలకేగాని, సర్వెంటు మాటలకు కాదు. సర్వెంటు మాటలకు లొంగిపోవడంవల్ల కైక దుఃఖానికి గురి అయింది. రాముని వెంట సీతకూడా అరణ్యానికి బయలుదేరింది. "నాథా! సతికి పతియే దైవము. పతి ఎక్కడుంటే సతి అక్కడుండాలి", అన్నది. "అన్నా! నిన్ను విడిచి నేను క్షణమైనా ఉండలేను", అంటూ లక్ష్మణుడు కూడా వారివెంట అరణ్యానికి వెళ్ళాడు. లక్ష్మణ, శత్రుఘ్నులు సుమిత్రకు పుట్టినటువంటివారు. సుమిత్ర మహాగుణవంతురాలు, సార్థక నామధేయురాలు. ఆమె తన కుమారులిద్దరినీ సేవకే అంకితం చేసింది. ఆమె అభీష్టం మేరకు లక్ష్మణుడు రామునికి సేవ చేస్తూ వచ్చాడు; శత్రుఘ్నుడు భరతుని సేవిస్తూ వచ్చాడు.

sri sathyasaivachanamrutam

### సంచరించే స్థలమునుబట్టి మనస్సు మారిపోతుంది

ఒకనాడు సీతారామలక్ష్మణులు అరణ్యంలో సంచరిస్తుండగా ఉన్నట్లుండి లక్ష్మణుని మనస్సు మారిపోయింది. 'అన్నా! ఎందుకు మనకీ అరణ్యవాసం! ఎందుకిన్ని కష్టాలను అనుభవించాలి మనం! ఎండ కన్నెరుగని సీతమ్మను ఎందుకిన్ని బాధలకు గురిచేయాలి! ఈ అరణ్యంలో రాక్షసులబారినుండి సీతమ్మను కాపాడుకోవడం చాలా కష్టం. కాబట్టి, మనం అయోధ్యకు తిరిగి వెళ్లి సుఖంగా జీవిద్దాం", అన్నాడు. అప్పుడు రాముడు గ్రహించాడు, అది స్థల ప్రభావమని. చిరునవ్వుతో లక్ష్మణుని చేయిపట్టుకొని కొంత దూరం ముందుకు నడిచి, "ఇప్పుడు చెప్పు లక్ష్మణా! మనం అయోధ్యకు తిరిగి వెళదామా?" అని అడిగాడు. లక్ష్మణుడు తన పొరపాటును గ్రహించి పశ్చాత్తాపపడ్డాడు. "అన్నా! మనం అయోధ్యకు పోనక్కర్లేదు. తండ్రి ఆజ్ఞ ప్రకారం మనం పద్నాలుగేళ్ళు అరణ్యంలోనే జీవించాలి. ఏనాడూ నీకు ఎదురు చెప్పని నేను ఈనాడు ఎందుకిలా మాట్లాడాను? నా మనస్సు ఎందుకీవిధంగా మారిపోయిందో నాకు బోధపడటం లేదు", అన్నాడు. "లక్ష్మణా! ఇది నీకు సహజంగా ఉన్న గుణము కాదు. ఇది స్థలప్రభావము. రాక్షసులు సంచరించే ప్రదేశంలో ప్రవేశించావు కనుకనే నీలో రాక్షస గుణములు ప్రవేశించాయి", అని చెప్పి రాముడు లక్ష్మణుని సమాధాన పరచాడు. కనుక, మనము దేశ, కాల, పరిస్థితులతోపాటు మనము సంచరించే స్థల ప్రభావాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

### మీరు భగవంతుని అంశమని గుర్తించి వర్తించండి

సత్శీలమునుగురించి రామాయణము బోధించి నంతగా మరే గ్రంథమూ బోధించటం లేదు. ఈనాడు చాలామంది రామాయణ విశిష్టతను గుర్తించుకోలేక పోతున్నారు. భారతీయుల హృదయమే రామాయణం. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించలేకపోవడమే ఈనాడు భారతీయులు పడుతున్న అన్ని కష్టాలకు మూల కారణం. ఎక్కడ ఉండినను మనిషికి బాధలు తప్పినవి కావు. అయితే, భగవంతునిపై భారం వేసి వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి.

srisathyasaivahini.org

**అడవులందున్న ఆకసముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేట పడియున్న**
**దిక్కులేనివారికి దిక్కు దేవుదేను.**

భగవంతుని తత్త్వాన్ని గుర్తించుకున్నవారికే ఈ సత్యము అర్థమవుతుంది. ముఖ్యంగా, ఈనాటి యువకులు సద్గుణాలను పెంచుకోవాలి. మీరందరూ భగవంతునియొక్క బిడ్డలే! భగవంతుడే చెప్పాడు, "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". కనుక, భగవంతుని గుణములను అనుసరించి, భగవంతునివలె మీరు జీవించాలి. "మేము భగవంతుని అంశము" అని భావించినప్పుడే మీరు బాగుపడతారు. 'నేను ఫలాని వ్యక్తి కుమారుణ్ణి, ఫలానివాని సోదరుణ్ణి, ఫలానివాని బావమరిదిని' అని అనుకున్నంతకాలం మీరు ఫలానివారిగానే మిగిలిపోతారు. 'నేను భగవంతుని అంశమును' అని గుర్తించినప్పుడే మీకు ఆత్మతత్త్వము అర్థమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మీరందరూ మంచి పిల్లలే! అంతా బంగారంవంటి పిల్లలే! కాని, వాతావరణము మిమ్మల్ని కొంత పాడుచేస్తుంది, ఆహారముకూడను కొంత పాడుచేస్తుంది. మీ స్నేహితులు మంచివారైతే మీకు మంచిమాటలు చెబుతారు; మంచివారు కాకపోతే మీకు చెడ్డ విషయాలు చెబుతారు, చెడ్డ ఆలోచనలు కలిగిస్తారు. కనుక, మీరు మంచి ఫ్రెండ్స్‌తో చేరాలి. ఇతరులు చెప్పే 'న్యూసెన్స్' (nuisance) విని మీరు మీ జీవితాన్ని 'న్యూసెన్స్'గా చేసుకోవద్దు. సత్సంగంలో చేరి మంచిపేరు తెచ్చుకోండి. Be good, do good, see good. This is the way to God (మంచిగా ఉండు, మంచినే చేయి, మంచినే చూడు. దైవసన్నిధికి ఇదే మార్గం).

**మానవతా విలువలే మనకు మంచి స్నేహితులు**

ప్రేమస్వరూపులారా! మీరు మీ జీవితమును రామాయణంగా తీర్చిదిద్దుకోవాలి. 'దేవుడెక్కడున్నాడు?' అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే 'నాలోనే ఆత్మరూపుడై ఉన్నాడు', అని

sri sathyasaivachanamrutam

చెప్పాలి. ఆత్మయే నీవు. ఆత్మకంటే మించినటువంటిది మరొకటి లేదు. దానినే 'కాన్షియస్‌నెస్' అంటారు. మీ అంతరాత్మను మీరు అనుసరించండి. పిచ్చిపిచ్చి భావాలను దూరం చేసుకోండి. అవి వచ్చినప్పుడు వాటినిగూర్చి మీరు ఏమాత్రం చింతించకండి. మీరు కంటితో అనేక దృశ్యాలను చూస్తూ, చెవులతో అనేక విషయాలను వింటూ ఈ ప్రపంచంలో జీవనం సాగిస్తున్నప్పుడు చెడ్డ భావాలు వస్తుంటాయి. మీకు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే ఆరుమంది శత్రువు లున్నారు. ఈ ఆరుమంది మిమ్మల్ని చెడ్డ మార్గంలో తీసుకుపోతుంటారు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మనకు మంచి స్నేహితులు. వారితో స్నేహాన్ని అభివృద్ధి చేసుకోండి. మంచివారితో స్నేహం చేస్తే మీరు good boys అవుతారు. లేకపోతే, bad boys గా మారిపోతారు. మంచిపేరు తెచ్చుకోండి. మీ తల్లిదండ్రులకుకూడా మంచిపేరు తీసుకురండి. మీపైన మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారు. కాబట్టి, వారిని సంతోషపెట్టండి. వారి ఆజ్ఞను మీరు శిరసావహించండి. అప్పుడే మీరు ధన్యులౌతారు, పుణ్యులౌతారు.

**(తేదీ 14.8.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam